## చోరీ కేసులో ఒకరి అరెస్ట్

చెన్నూర్ టౌన్, మార్చి 13 : వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును దొంగిలించిన కేసును పోలీసులు ఛేదించారు. చోరీ చేసిన సిద్ధిపేట పట్టణానికి చెందిన అంతర్ జిల్లా నేరస్తుడు కూలీ అల్లెపు కృష్ణ (47)ను పట్టుకొని పలు కేసులు నమోదుచేశారు. జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి సంబంధిత వివరాలను డీసీపీ ఏ.భాస్కర్ గురువారం వెల్లడించారు. చెన్నూర్‌కు చెందిన జంగ మణెమ్మ ఈ నెల 10న స్థానిక పాత బస్టాండుకు వచ్చింది. ఒంటరిగా ఉన్న ఆమెను నేరస్తుడు కృష్ణ గమనించి వెంబడించాడు. మాటలు కలిపి ఆమెను గ్రోమోర్ దుకాణం పక్కన గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. మెడలోని గొలుసు ఇవ్వాలని, లేకుంటే గొంతు నులిమి చంపేస్తానని వృద్ధురాలిని బెదిరించాడు. బలవంతంగా ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. మణెమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్ రావు కేసు నమోదుచేశారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసి గాలించారు. 13న గురువారం ఉదయం తన సిబ్బందితో కలిసి వెంకటేశ్వర్ రావు కొత్త బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తుండగా నిందితుడు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. కృష్ణను పట్టుకొని విచారణ చేయగా దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద ఉన్న గొలుసును స్వాధీనం చేసుకున్నారు. అతనిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితున్ని పట్టుకొని కేసును ఛేదించడంలో కృషి చేసిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లును, చెన్నూర్ సీఐ రవీందర్, ఎస్ఐ పీ.సుబ్బారావు, ఎస్ఐ కే.వెంకటేశ్వర్ రావు, హెచ్‌సీలు వీ.సంపత్, దేవేందర్, పీసీ ఎన్.జీవన్‌ను అభినందించారు.

## అలుగును వేటాడిన ముగ్గురిపై కేసు

హాజీపూర్, మార్చి 13 : మండలంలోని సబ్బపెల్లి గ్రామ శివారులోని మామిడితోటలో అలుగును వేటాడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు లక్సెట్టిపేట ఇన్‌చార్జి రేంజ్ అధికారి అత్తె సుభాష్ తెలిపారు. మండలంలోని టీకన్నపల్లికి చెందిన చాకెపెల్లి సత్తయ్య, రావుల లక్ష్మణ్, చాకెపల్లి వెంకటేష్ అలుగును వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు దాడి చేసి అలుగు మాంసంతోపాటు నిందుతుల్ని పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో హాజీపూర్ డిప్యూటీ రేంజ్ అధికారి సునీత, బీట్ ఆఫీసర్ తదితరులున్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

బెజ్జూర్, మార్చి 13: మండల కేంద్రానికి చెందిన కావుడె లస్మయ్య (54) అనే అతడు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లస్మయ్య మద్యానికి పానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి లస్మయ్యను మండల కేంద్రంలోని సర్కారు దవాఖానకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

లక్సెట్టిపేట, మార్చి 13: మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించినందుకు పట్టణానికి చెందిన బొప్పు సతీశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు లక్సెట్టిపేట ఎస్ఐ పీ సతీశ్ తెలిపారు. వివరాల ప్రకారం ఈ నెల 11న పట్టణానికి చెందిన ఓ మహిళ ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించినందుకు బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

కన్నెపల్లి, మార్చి 13 : మండలంలోని జంగపెల్లిలో పెద్దింటి వెంకటేశ్ నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. పీడీఎస్ బియ్యం నిల్వ ఉందని సమాచారం రావడంతో వెంకటేశ్ ఇంట్లో తనిఖీ చేయగా 3.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం దొరికాయన్నారు. సుర్జాపూర్‌కు చెందిన ఇందూరి లక్ష్మణ్ తన ఇంట్లో ఉంచాడని చెప్పాడన్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రేషన్ డీలర్‌పై కేసు

మందమర్రి రూరల్, మార్చి13: పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం సరఫరాలో పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరా అధికారి బ్రహ్మారావ్ అన్నారు. రేషన్ దుకాణాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు గురువారం రామకృష్ణాపూర్ ఆర్కే-1 మార్కెట్ ఏరియాలో ఉన్న 38 నంబరు గల రేషన్ దుకాణంలో తనిఖీలు చేశారు. దుకాణంలో ఉండాల్సిన నిల్వల కన్నా మూడున్నర క్వింటాళ్ల బియ్యం తక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు సదరు డీలరుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో ఏసీఎస్వో వేణుగోపాల్, ఆర్ఐ భూమేశ్ తదితరులు ఉన్నారు.

## జంటపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

- ఇందారం పొనూర్ క్రాస్‌రోడ్డు అటవీ ప్రాంతంలో ఘటన



ఘటనా స్థలంలో విచారణ చేపడుతున్న పోలీసులు

జైపూర్, మార్చి 13: జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం పొనూర్ క్రాస్‌రోడ్డు అటవీప్రాంతంలో బుధవారం రాత్రి ఓ జంటపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి వారివద్ద నుండి నాలుగువేల నగదు, ఒక సెల్‌ఫోన్ అపహరించుకుపోయిన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జైపూర్ ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెనకు చెందిన అరికెల్ల సుమన్ గోదావరిఖని దవాఖానలో చికిత్స పొందుతున్న తన బంధువును చూసి అతని సమీప బంధువైన యువతితో మంచిర్యాల వెళ్తూ ఇందారం అటవీ ప్రాంతం వద్ద మూత్రవిసర్జనకు ఆగారు. అక్కడే మద్యం సేవిస్తున్న గుర్తు తెలియని ముగ్గురిని ఇక్కడ ఏం చేస్తున్నారంటూ వీరిని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి వారిని కొట్టి వారి వద్ద గల రూ.4 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను అపహరించుకు పోయినట్లు తెలిపారు. యువకుడిపై దాడి చేసి యువతిపై ముగ్గురు వ్యక్తులు లైంగికదాడిపై పాల్పడ్డట్లుగా ప్రచారం జరగడంతో ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం ఘటనా స్థలాన్ని మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో పాటు రామగుండం కమిషనరేట్ ఉన్నతాధికారులు సందర్శించారు. లైంగికదాడి వాస్తవం కాదని అటవీ ప్రాంతంలో ఆగడంతో వారిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## పింఛన్లు ఇప్పించండి

చెన్నూర్, మార్చి 13: డయాలిసిస్ పేషెంట్లకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని పలువురు డయాలిసిస్ పేషెంట్లు కోరారు. కిడ్నీలు చెడిపోయి డయాలిసిస్ చేయించుకునే పేషంట్లకు ప్రతి నెలా రూ 2,000 పింఛను గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా చేరిన డయాలిసిస్ పేషెంట్లకు ఎలాంటి పింఛన్ ఇవ్వడం లేదని ఆరోపించారు. తమకు కూడా పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని కుమార్ దీపక్‌ను కోరారు.

## గురుకులాల్లో 32 మంది విద్యార్థుల ఉత్తీర్ణత



గురుకుల పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో హెచ్ఎం సుధాకర్ రెడ్డి

చెన్నూర్ రూరల్, మార్చి 13: చెన్నూర్ పట్టణంలోని ఎస్‌జీవీ పాఠశాలకు చెందిన 32 మంది 4వ తరగతి విద్యార్థులు గురుకుల ఎంట్రెన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్ల సుధాకర్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో 4వ తరగతిలో ఉన్న 32 మంది విద్యార్థులు గురుకుల పరీక్ష రాయగా.. 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరాటే మాస్టర్‌కు ఆర్థిక సాయం

మందమర్రి రూరల్, మార్చి13 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సీనియర్ కరాటే మాస్టర్ కు జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అండగా నిలిచి ఆర్థిక సహాయం అందజేసింది. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయం వద్ద ప్రమాద బాధితుడికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తమ తోటి మాస్టర్ కోసం విరాళాలు సేకరించి బాధితుడికి అందజేసినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి, కోశాధికారి కనగర్తి రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్,సీనియర్ మాస్టర్లు హరికృష్ణ, నరేశ్, ప్రసాద్, రమేశ్ రాజా, రవి, రాజేశ్, శ్యామ్ పాల్గొన్నారు.

## బాల్య మిత్రులకు బాసటగా..

దండేపల్లి, మార్చి13: దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తనతో పాటు చదువుకున్న మంచిర్యాలకు చెందిన ఇద్దరు మిత్రులు నాగరాజు, తిరుపతి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న 2004-05 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రులు తనతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థుల కుటుంబాలకు అండగా నిలిచారు. రూ.20వేల ఆర్థిక సహాయం గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు సాయికుమార్, అనిల్, స్వామి, ప్రసాద్, మహేశ్, నరసింగరాజు, తదిరులు ఉన్నారు.

## సీసీ రోడ్డు ప్రారంభం

వేమనపల్లి, మార్చి 13 : మండలంలోని జక్కెపల్లిలో గురువారం మండల మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 20 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

కాసిపేట, మార్చి 13 : నకిలీ విత్తనాలు అమ్మినా సాగు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ భోజన్న, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏవో చల్ల ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నకిలీ పత్తి విత్తనాలు, గ్లైసిల్ బీటీ పత్తి విత్తనాలపై అరికట్టడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ భోజన్న, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఏవో చల్ల ప్రభాకర్‌లు వేర్వేరుగా మాట్లాడి విత్తనాల కొనుగోలులో రైతులకు పలు సూచనలు చేశారు. గ్లైసిల్ మందును తట్టుకునే బీటీ పత్తి రకాన్ని సాగు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమ్య, రైతులు పాల్గొన్నారు.

**ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు**

వేమనపల్లి, మార్చి 13 : మండలంలోని నీల్వాయి, గొర్లపల్లి, వేమనపల్లి గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాలను గురువారం ఎస్ఐ శ్యామ్‌పటేల్, మండల వ్యవసాయాధికారి వీరయ్య తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్లను, ఎరువుల నిల్వలను, విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. రైతులకు రసీదులు అందించాలని సూచించారు.

**నెన్నెల, మార్చి13:** నెన్నెలలోని పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను మండల ఏవో సృజన, ఎస్ఐ ప్రసాద్ తనిఖీ చేశారు. గోదాములను పరిశీలించారు. విత్తనాలు, ఎరువుల గడువు తేదీలను పరిశీలించారు. వారి వెంట ఏఈవో రాంచందర్ ఉన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

దండేపల్లి, మార్చి 13: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని లక్సెట్టిపేట సీఐ నరేందర్ అన్నారు. దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, రౌడీ షీటర్లపై నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ తహసినొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

నస్పూర్, మార్చి 13 : విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలని ఎస్సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ జే ఎల్లయ్య సూచించారు. గురువారం జిల్లా మంచిర్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాసిపేట ఆదర్శ పాఠశాల, కాసిపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను మరో పరిశీలకుడు స్టాలిన్‌తో కలిసి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట మంచిర్యాల జిల్లా సమగ్ర శిక్ష క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి ఉన్నారు.

### ఆదివాసీ సంప్రదాయబద్ధంగా

# హోలీ

- కామదహన వేడుకల్లో

**అడవి బిడ్డల ప్రత్యేక ఆచారాలు**



బెజ్జూర్ : కుకుడలో పూజలు చేస్తున్న గిరిజనులు



సిర్పూర్(యూ) : కామ దహనం చేస్తున్న ఆదివాసీలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ/కెరమెరి/సిర్పూర్(యూ)/ బెజ్జూర్, మార్చి 13 : హోలీ, కామ దహన వేడుకలను ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలు తమ ఆచారాల ప్రకారం నిర్వహిస్తూ ప్రత్యేకతలను చాటుకుంటున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు ఆదివాసీ గ్రామాల్లో కామదహన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కామ దహనానికి ముందే గిరిజన గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి ఒక్కో కుడుకను సేకరించి గ్రామ పటేల్ ఇంటికి తీసుకువస్తారు. ఒకవేళ కుడుకను ఎవరైనా ఇవ్వకపోతే తమ ఆచార వ్యవహారాలను ధిక్కరించినట్లుగా భావించి ఆకుటుంబాన్ని సంఘ బహిష్కరణ చేస్తారు.

**అడవికి వెళ్లి వెదురు బొంగులు తెచ్చి...**

కామదహనం రోజు ఉదయం నుంచే మాతరి, మాతర ప్రతీకలుగా రెండు వెదురు బొంగులకు అలంకరణ చేస్తారు. గ్రామస్తులందరి వద్ద నుంచి సేకరించిన కుడుకలతో దండలు తయారు చేసి వాటికి తగిలిస్తారు. కామ దహనం రోజు సాయంత్రం ఊరేగించి గ్రామం బయటకు తీసుకువచ్చి దహనం చేస్తారు. 15 రోజులుగా పిల్లలు ఆడుకుంటున్న కోలలనువేసి మంటల్లో వేస్తారు. అనంతరం వాటి చుట్టూ సాంప్రదాయ నృత్యాలు చేస్తారు. మంటల్లో మాతరి, మాతరల పేర్లతో ఉన్న వెదురు కర్రలు కింద పడిపోకుండా చూస్తారు. వాటికి కట్టిన కుడకలను చిన్న ముక్కలుగా చేసి గ్రామంలో అందరూ పంచుకుంటారు. హోలీ రోజు ఉదయం బూడిదను తీసుకెళ్లి ఇంటింటికీ పంచుతారు. హోలీ రంగుల్లో ఈ బూడిదను కలిపి సంబురాలు నిర్వహిస్తారు. కుడుకలు, బూడిద ఇంట్లో నిల్వ చేసి అనారోగ్యం కలిగినా, గాలి, నీడ సోకినా ఈ బూడిద బొట్టు పెట్టి నీళ్లలో కలిపి తాగిస్తుంటారు.

**అడవికి అందాలు తెచ్చిన గోగుపూలు**

హోలీ పండుగకు ముందు అడవిలో, వాగులు, రోడ్లకు ఇరువైపులా ఎర్రగా విరబూసే గోగుపూలు (మోదుగ పూలు)తో తయారు చేసిన రంగులను హోలీ పండుగలో చల్లుకోవడం ఆదివాసీల్లో ఆనవాయితీగా వస్తున్నది. వీటితో ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని తెలిపారు. రసాయన రంగులతో చర్మ సమస్యలు తలెత్తుతాయని గ్రామాల్లో పెద్దలు సూచిస్తున్నారు.

**పిల్లలకోసం చక్కర బిళ్లల పేర్లు..**

హోలీ పండుగ వచ్చిందంటే మార్కెట్లో చక్కర బిళ్లల పేర్లు కనిపిస్తాయి. హోలీ పండుగ రోజు చిన్నపిల్లల మెడలో వేయడం అనవాయితీగా వస్తున్నది.

## కేక్‌లు కోసి..మొక్కలు నాటి..

- ఘనంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు



మందమర్రి వర్క్‌షాప్ వద్ద కేక్‌కట్ చేస్తున్న నాయకులు, కార్మికులు



శాంతిఖని గని ఆవరణలో మొక్కలు నాటుతున్న టీబీజీకేఎస్ నాయకులు

బెల్లంపల్లి/మందమర్రి, మార్చి 13 : బెల్లంపల్లిలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు బడికెల రమేశ్ ఆధ్వర్యంలో శాంతిఖని గని ఆవరణలో మొక్కలు నాటారు. తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు ఈట రాకేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లూరి మౌనిక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. జిల్లా నాయకులు అరేపల్లి వంశీనాథ్, రెడ్డవేణ శ్రీనాథ్, కార్తీక్, బండారి రేవంత్, కందుల స్వరాజ్, సల్మాన్, ఇందురి సాయి, ముక్క సాయి, సల్ల సాయి, వెంకట్‌సాయి, సల్మాన్, ప్రవీణ్, అరవింద్, సుమంత్, మహంతి, పింగిలే గౌతమ్, రాజ్ కుమార్, బబ్బి, కరణ్, సాగర్, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు సబ్బని అరుణ్, మైనార్టీ టౌన్ అధ్యక్షుడు అలీ భాయ్, జనరల్ సెక్రెటరీ ఖలీం, నాయకులు మురుకురి శ్రావణ్, మద్దెల గోపి, చంద్రశేఖర్, ధర్మేందర్, దాగం చరణ్, మహేందర్, చరణ్, యశ్వంత్, బబ్బుల్, ఖలీల్ పాల్గొన్నారు.

**మందమర్రిలో**

మందమర్రి పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాయలంలో నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. సింగరేణి వర్క్ షాప్ ఎదుట నాయకులు, కార్మికులు, మనో వికాస్ పాఠశాల యాజమాన్యం కేక్‌కట్ చేశారు. విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు.

**జన్మదినం సందర్భంగా ఇఫ్తార్ విందు**

వాంకిడి, మార్చి 13: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని తెలంగాణ జాగృతి వాంకిడి మండల అధ్యక్షుడు కిరిమిల్ల వినోద్ చారి అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని వాంకిడి మండల కేంద్రంలో తెలంగాణ జాగృతి మండల అధ్యక్షుడు కిరిమిల్ల వినోద్ చారి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు పీ.చంద్ర శేఖర్ వాంకిడి మాజీ సర్పంచ్ బండే తుకారం, మజీద్ సదర్ హమీద్, మత పెద్దలు,జాగృతి సభ్యులు రాకేశ్, శైలేశ్, రవి, ముస్లిం నాయకులు తదితరులు ఉన్నారు.



వాంకిడి : ఇఫ్తార్ విందు ఇస్తున్న జాగృతి నాయకులు

**శుభాకాంక్షలు తెలిపిన నాయకులు**

దండేపల్లి, మార్చి13: దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన బీఆర్ఎస్‌వీ నాయకుడు తోట పవన్ వర్మ హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత స్వగృహంలో ఆమెను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## దాడిలో గాయపడిన మహిళ మృతి

మందమర్రి, మార్చి 13: ఈ నెల 11న తాగునీరు ఇవ్వలేదనే సాకుతో మద్యం మత్తులో కందుల కుమార్ అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ పాత సీఎస్పీ రోడ్డు కాలనీకి చెందిన పొగిడి రాంబాయి వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. అదే కాలనీకి చెందిన కుమార్ అనారోగ్యం బారిన పడి గత కొంత కాలంగా నస్పూర్ కాలనీ ఆర్కే5 ఏరియాలో నివాసముంటున్నారు. గత వారం రోజుల క్రితం పాత సీఎస్పీ రోడ్డు కాలనీలోని తన ఇంటికి వచ్చిన నిందితుడు మద్యం మత్తులో సోమవారం రాత్రి సమీపంలోని రాంబాయి ఇంటికి వెళ్లి తాగునీరు అడిగాడు. వారు నీరు లేదని చెప్పి ఇవ్వకపోవడంతో గొడ్డలితో రాంబాయి పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రాంబాయిని కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ రాంబాయి మృతి చెందింది. రాంబాయి కుమారుడు రవి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భీమారంలో గంజాయి ముఠా అరెస్ట్

భీమారం, మార్చి 13 భీమారం మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను భీమారం పోలీసులు పట్టుకున్నారు. జైపూర్ ఏసీపీ కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు వివరాలు వెల్లడించారు. నేషనల్ హైవే పక్కనే కర్ర డిపో ఎదురుగా కాసిపేటకు చెందిన దుర్గం సందీప్, భీమారం మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన దుర్గం సంజయ్ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కి వెళ్లి అక్కడ రైల్వే స్టేషన్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుక్కొని వచ్చి భీమారం చుట్టు పక్కల ప్రాంతంలో అమ్ముతున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 11 న అక్కడ నుంచి కిలోన్నర గంజాయి తెచ్చి భీమారం గ్రామ శివారులో చెన్నూర్ మండలం కిష్టంపేట్‌కు చెందిన సింగరేణి కార్మికుడు వనపర్తి కరుణ సాగర్, అదే గ్రామానికి చెందిన రావుల ఆదర్శ్, భీమారం మండలంలోని సుంకరిపల్లికి చెందిన రామటెంకి స్వస్తిక్ కుమార్, భీమారం బీసీ కాలనీకి చెందిన జునేరి శ్రీనివాస్‌కు అమ్ముతుండగా నమ్మదగిన సమాచారం మేరకు భీమారం ఎస్ఐ కే. శ్వేత పట్టుకునివారి వద్ద నుంచి రూ. 39875 విలువ గల కేజీన్నర గంజాయి, రూ. 2 వేల నగదు, ఒక్క సెల్ ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న సిబ్బందిని డీసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ సీఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్లు మాచర్ల, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

## 'అపార్' నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 13: అపార్ గుర్తింపు కార్డులను నమోదు, సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవితో కలిసి సెక్టోరల్ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ ద్వారా అపార్, సమగ్ర శిక్ష అభియాన్ కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అపార్ గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ పథకం కింద అమలవుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల తనిఖీ

మందమర్రి రూరల్, మార్చి 13 : పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మంచిర్యాల డీఈవో పీ యాదయ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని గుడిపెల్లిలోని జడ్పీ ప్రాథమిక పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. సిలబస్‌పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యాదేవికి పలు సూచనలు చేశారు. భోజనం కలుషితం జరగకుండా చూసుకోవాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మంచిర్యాల అర్బన్, మార్చి 13: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు పట్టణ ఎస్ఐ ముత్తె ప్రవీణ్ కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో క్యాషియర్ బాలేశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 12న ఆసిఫాబాద్‌లో గల బంధువుల వివాహానికి వెళ్లారు. తిరిగి గురువారం ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన బాలేశ్వర్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఐదు తులాల బంగారు అభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

## భార్య మందలించిందని పురుగుల మందు తాగి ఆత్మహత్య

బెల్లంపల్లి, మార్చి 13 : భార్య మందలించిందని తాండూరు మండలం గోపాల్‌నగర్‌కు చెందిన రావుల సాంబయ్య(60) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ప్రతిరోజూ మద్యం తాగి గొడవ పడేవాడు. ఈ క్రమంలో భార్య మందలించడంతో మనస్తాపానికి గురై పొలంలో పురుగు మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి కొడుకు సంపత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## జంపన్న గద్దెకు నిప్పంటించిన నిందితుడి అరెస్ట్

చింతలమానేపల్లి, మార్చి 13 : మండలంలోని డబ్బా గ్రామంలో కొన్ని రోజుల క్రితం సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఉన్న జంపన్న గద్దెకు నిప్పు పెట్టిన ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ రమేశ్ సూచనలతో దర్యాప్తు చేపట్టారు. డబ్బా గ్రామానికి చెందిన చింతల మల్లేశ్ అనే వ్యక్తి మతి స్థిమితం లేకుండా తిరుగుతున్న క్రమంలో డబ్బా క్రాస్ రోడ్డు వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద అగ్గి పెట్టెను తీసుకొని జంపన్న గద్దెకు ఉన్న బట్టలకు నిప్పంటించాడు. ఈ క్రమంలో విచారణ చేపట్టగా సమ్మక్క సారలమ్మ గద్దెల పక్కన ఉన్న హోటల్‌లో సీసీ కెమెరాల పుటేజీలో ద్వారా గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి సిర్పూర్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ తెలిపారు. మల్లేశ్‌ను చికిత్స నిమిత్తం ఎర్రగడ్డ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనకు చర్యలు



పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 13: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం కౌటగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ఆసిఫాబాద్‌లోని జనకాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో భవనాల మరమ్మతు పనులు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి, చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నమోదై ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని, వేసవికాలం దృష్ట్యా పిల్లలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లలో నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా పోషణ్ అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, సూపర్‌వైజర్లు లైలా, పెంటు బాయి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలి

వివిధ రకాల పనుల నిమిత్తం సమీకృత కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్‌ను పరిశీలించారు. ఫ్రిడ్జ్‌కి మరమ్మతులుంటే చేయించాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్‌ను ఆదేశించారు.

## విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేత

రెబ్బెన, మార్చి 13: క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన రెబ్బెన మండలం గంగాపూర్ కేజీబీవీ విద్యార్థినులకు మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఎమ్మెల్యే హరీశ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలందుకున్నట్లు ఎస్వో పద్మ తెలిపారు.

## నేడు డయల్ యువర్ డీఎం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 13: జిల్లాలో ఆర్టీసీ సేవలపై నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ విశ్వనాథ్ గురువారం తెలిపారు. సమస్యలు, సలహాలు, సూచనలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లా పరిధిలోని ప్రయాణికులు 9959226006 నంబర్ కి ఫోన్ చేసి చెప్పవచ్చని తెలిపారు.

## సమాజ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

వాంకిడి, మార్చి 13 : సమాజ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ సమతా సైనికులుగా పనిచేయాలని భారతీయ బౌద్ధ మహా సభ (బీఎస్ఐ)జిల్లా అశోక్ మహుల్కార్ అన్నారు.గురువారం వాంకిడి మండల కేంద్రంలో సమతా సైనిక్ దళ్ జిల్లా ఇన్చార్జి దుర్గం సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమత సైనిక్ 98వ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దళితుల సంక్షేమానికి 1927మార్చి 13న సమతా సైనిక్ దళ్ ఏర్పడిందని తెలిపారు. ఈ కార్య క్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ మండల అధ్యక్షుడు జయరాం, ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్ కుమార్, సమాజ అధ్యక్షుడు విలాస్ కొబ్రాగడే, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులున్నారు.

## కేజీబీవీ తనిఖీ

కౌటాల, మార్చి 13 : మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంఈవో గావుడే హన్మంతు గురువారం తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించి పలు సూచనలు చేసారు. 6వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న విద్యాభ్యాసనాన్ని పరిశీలించారు. వంట గది, స్టోర్ రూంలలోని సరుకులను పరిశీలించి ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, మార్చి13: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చోటు చేసుకోకుండా రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రాథోడ్ శేషారావు అన్నారు.గురువారం దహెగాంలో పొలం బాట కార్యక్రమ నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. డీఈ నాగరాజు ఏఈ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో వైద్య శిబిరం

కాగజ్‌నగర్, మార్చి 13: కాగజ్‌నగర్‌లోని పోలీసు స్టేషన్‌లో పోలీసులకు హైదరాబాద్ కేర్ దవాఖాన సహకారంతో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్, పట్టణ, రూరల్ సీఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు సుధాకర్, సందీప్, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీల ఆందోళన

కాగజ్‌నగర్, మార్చి 13: కాగజ్‌నగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధిహామీ కూలీలు గురువారం ఆందోళన నిర్వహించారు. ఇటీవలే అటవీ శాఖ బీట్ అధికారి ఉపాధి హామీ పనులను అడ్డుకొని, దురుసుగా ప్రవర్తించిన తరుణంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆందోళన నిర్వహించారు. డీఆర్‌డీవో దత్తురాం వచ్చి కూలీలతో మాట్లాడారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## కంకర లారీల పట్టివేత

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 13: అనుమతులు లేని రెండు కంకర లారీలను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ అధికారి గంగాధర్ గౌడ్ తెలిపారు. రాయల్టీ ఫీజు చెల్లించకుండా హైదరాబాద్ నుంచి ఆసిఫాబాద్ జిల్లాకు వస్తున్న కంకర లారీలను గురువారం జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద పట్టుకొని 23,460 జరిమానా విధించినట్లు తెలిపారు.

## పురుగుల మందు తాగి మహిళ మృతి

చింతలమానేపల్లి, మార్చి 13 : మండలంలోని లంబాడిహేటి గ్రామంలో పురుగుల మందు తాగి ఒకరు మృతిచెందినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన అజ్మీరా శాంతాబాయి (53) అనారోగ్యం బాధపడుతున్నది. అప్పులు కావడంతో పురుగుల మందు తాగి మృతిచెందింది. మృతురాలి కొడుకు అజ్మీరా ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

నస్పూర్,మార్చి 13 : ఈ నెల 19లోగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని అన్ని జిల్లాల అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 1,470 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 2, 3 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.